నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 11 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI

నెలాఖరున భూదాన్‌పోచంపల్లిలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

చిలుకూరు, ఆగస్టు 10 : తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30, 31, సెప్టెంబర్ 1న యాద్రాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నట్లు సూర్యాపేట జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యడవెల్లి పుల్లారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఐడీ కార్డులతో కేటగిరీల వారీగా పేర్లు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. 7013301553, 9966148808 ఫోన్ నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

సర్కారు స్కూళ్లకు నిధుల్లేవ్

పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలైనా అందని నిధులు

సొంత డబ్బులతో రికార్డులు, రిజిస్టర్లు కొనుగోలు చేస్తున్న హెచ్ఎంలు, టీచర్లు

క్రీడల గ్రాంట్ పరిస్థితీ అంతే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2,670 పాఠశాలల్లో ఇబ్బందులు

విద్యా రంగానికి పెద్దపీట వేస్తామని చెప్పున్న కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మాత్రం చిన్నచూపు చూస్తున్నది. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా పాఠశాలల నిర్వహణకు నిధులు కేటాయించకపోవడం విస్మయం గొల్పుతున్నది. కేసీఆర్ సర్కారులో పాఠశాలల ప్రారంభం నాటికే పాఠశాల నిర్వహణ(కాంపోజిట్ గ్రాంట్)ను ఆయా పాఠశాలలకు రెండు విడుతల్లో విడుదల చేసేది. కాంగ్రెస్ పాలనలో మాత్రం నెలలు గడుస్తుడడంతో పాఠశాలల నిర్వహణ కష్టంగా మారుతున్నది. స్కూళ్లకు అవసరమైన రిజిస్టర్లు, రికార్డులు, స్టేషనరీ, చాక్‌పీస్‌లు, ప్రయోగశాలల మెటీరియల్‌ను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులే సొంత డబ్బుతో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్రీడల నిర్వహణ గ్రాంట్‌ను కూడా విడుదల చేయకుండా ఆటలపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది.

– రామగిరి, ఆగస్టు 10

విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యాశాఖ, ప్రభుత్వం పాఠశాలలకు నిర్వహణ నిధులు విడుదల చేయాలి. వాటితో రాష్ట్ర అవతరణ దినోత్సవం, బడిబాట, పాఠశాలకు అసరమైన రిజిస్టర్లు, రికార్డులు, టీచింగ్ డైరీలు, స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, విద్యార్థులకు నిర్వహించే పరీక్షల సామగ్రి, చాక్‌పీస్‌లు, బోర్డులు, దినపత్రికలు, విద్యుత్ బిల్లు, ఇతర అవసరాలను వెల్లడీయాల్సి ఉంటుంది. కానీ, ఇప్పటివరకు నిధులు విడుదల చేయకపోవడంతో ఉపాధ్యాయులు, హెచ్ఎంలు సొంత డబ్బులతో బోధన, నిర్వహణ సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు మౌలిక వసతుల మధ్య విద్యా బోధన చేస్తూనే, వారిలో క్రీడా సామర్థ్యాలను కూడా పెంచాల్సి ఉంటుంది. అందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం క్రీడా నిధులు విడుదలు చేయాలి. వాటిని కూడా ఇప్పటివరకు ఇవ్వలేదు. దాంతో పండ్రాగస్టు నేపథ్యంలో నిర్వహించే క్రీడడా పోటీల ఖర్చులు, బహుమతులు కూడా చేతి నుంచే పెట్టాల్సి వస్తున్నదని పలువురు హెచ్ఎంలు వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పాఠశాలు..

జిల్లా	మండలాలు	పాఠశాలలు
నల్లగొండ	32	1,483
సూర్యాపేట	23	612
యాదాద్రి	17	575
మొత్తం	72	2,670

నిధుల మంజూరు ఇలా..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిర్వహణ నిధులను(కాంపోజిట్ గ్రాంట్స్) ప్రభుత్వం విడుదల చేస్తుంది. 1 నుంచి 30 మంది విద్యార్థులు ఉంటే 10వేల రూపాయలు, 31నుంచి 100 మంది ఉంటే 25వేల రూపాయలు, 101 నుంచి 250 మంది ఉంటే 50వేల రూపాయలు, 251 నుంచి వెయ్యి మంది వరకు ఉంటే 75వేలు రూపాయలను సంవత్సరానికి మంజూరు చేస్తుంది.

- అదే విధంగా క్రీడల కోసం ప్రాథమిక పాఠశాలలకు రూ.5వేలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.10వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.10వేలు అందిస్తుంది. ఇప్పుడు విడుదలపై సందేహాలు నెలకొన్నాయి. స్కూల్ గ్రాంట్స్ మంజూరు ఆలస్యం విషయంలో, జాడలేని క్రీడానిధులతోపాటు ఇతర విషయాలపై మాట్లాడేందుకు కూడా హెచ్ఎంలు, టీచర్లు భయపడుతుండడం గమనార్హం.

బదిలీపై వచ్చిన దేవస్థాన ఉద్యోగులకు విధుల కేటాయింపు

యాదగిరిగుట్ట, ఆగస్టు 10 : సాధారణ బదిలీల్లో భాగంగా వేములవాడ, కొమురవెల్లి, బాసర దేవస్థానాల నుంచి యాదగిరిగుట్టకు బదిలీపై వచ్చిన ఉద్యోగుల విధుల సర్దుబాటు ప్రక్రియను దేవస్థానం పూర్తి చేసింది. ప్రస్తుత సిబ్బంది విధుల్లో మార్పు చేస్తూ వివిధ విభాగాల్లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు విధులను కేటాయిస్తూ దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే దేవస్థాన రిసెప్షన్ కార్యాలయం, ప్రసాదాల విభాగం, పరిపాలన విభాగంతోపాటు చైతన్యపురి ఆలయం, బంజారా హిల్స్ దేవాలయ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఏఈఓ జూశెట్టి కృష్ణను రిసెప్షన్ కార్యాలయం, ప్రధానాలయం, శివాలయం, ప్రచారశాఖ, డోనర్ సెల్, శాశ్వత పూజలు, లాకర్స్ విభాగానికి అంతర్గత బదిలీ చేశారు. ప్రస్తుతం శానిటేషన్, కొండకింద వ్రత, వాహన పూజలు, అన్నదానం, వాహన ప్రవేశ కౌంటర్, ఆర్టీసీ బస్సులు నిర్వహణ, కల్యాణకట్ట, పుష్కరిణి, పాతగుట్ట దేవాలయం, గోదాం, గోశాల, దబ్బగుంటపల్లి, మల్లాపురం తోటల విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఏఈఓ గజవెల్లి రఘును ప్రసాద విభాగం, కొండపైన శానిటేషన్ విభాగానికి బదిలీ చేశారు. వేములవాడ దేవస్థానం నుంచి బదిలీపై వచ్చిన ఏఈఓ పి. నవీన్ పాతగుట్ట దేవాలయం, గోదాం, గోశాల, దబ్బగుంటపల్లి, మల్లాపురం తోటలు, కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి విభాగంలో విధులు నిర్వర్తించనున్నారు. పర్యవేక్షకులు వై. రాకేశ్‌రెడ్డిని ప్రసాద విభాగానికి, వేములవాడ నుంచి బదిలీపై వచ్చిన పర్యవేక్షకులు ఎన్.మహేశ్‌ను పాతగుట్ట, గోశాల, మల్లాపురం తోటలు, దబ్బగుంటపల్లికి మార్చారు. కె. నటరాజ్‌ను కొండకింద చౌల్ట్రీస్, జి. శ్రీనివాస్ ప్రధానాలయంలో విధులు చేపట్టనున్నారు. వేములవాడ దేవస్థానం నుంచి వచ్చిన సీనియర్ అసిస్టెంట్లు పి. శ్రీనివాస్‌ను పాతగుట్ట ఆలయానికి, ఎం. రవీందర్ గోదాముకు, ఎస్. పవన్‌కుమార్‌ను పాతగుట్ట ఆంజనేయస్వామి ఆలయానికి, ఆర్. రమేశ్‌ను వ్రత, వాహనపూజలు విభాగానికి, పి.రాజేందర్‌ను పాతగుట్ట ఆలయానికి కేటాయించారు. వేముల వాడ నుంచి బదిలీపై వచ్చిన జూనియర్ అసిస్టెంట్లు సీహెచ్. లింగయ్యను కొండకింద శానిటేషన్, ఎల్. రాజేందర్‌ను కొండపైన శానిటేషన్, కె. నాగేశ్‌రాజును అన్నదానం, ఎస్. తిరుపతిని కల్యాణకట్ట, తలనీలాలు స్టోర్‌కు, కొమురవెల్లి దేవస్థానం నుంచి బదిలీ వచ్చిన జూనియర్ అసిస్టెంట్లు పి. మాధవిని సీ3 విభాగం, ఇ. సందీప్‌కుమార్‌ను సీ2 విభాగం, బాసర నుంచి వచ్చిన టి.గోపాల్‌సింగ్‌ను రిసెప్షన్ విభాగానికి కేటాయించగా వారు బాధ్యతలు చేపట్టారు. వేములవాడ దేవస్థానం నుంచి బదిలీపై వచ్చిన డీఈఈ టి. రామేశ్వర్‌రావును దేవస్థాన డీఈఈ సివిల్ విభాగం, కొమురవెల్లి నుంచి బదిలీపై వచ్చిన విద్యుత్ విభాగం ఏఈ బి. అంజయ్యను దేవస్థాన ఏఈ విద్యుత్ విభాగానికి కేటాయించారు.

నకిరేకల్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, పక్కన మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్

పోలీస్ స్టేషన్లు వేదికగా ప్రజాపాలన

- **బెదిరింపు సంతకాలతో చైర్మన్‌పై అవిశ్వాసం**
- **నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**

నకిరేకల్, ఆగస్టు 10 : నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌పై అవిశ్వాసం పేరిట బీఆర్ఎస్ కౌన్సిలర్లను బెదిరించి సంతకాలు చేయించుకున్నారని, పోలీస్ స్టేషన్ల వేదికగా ప్రజా పాలన కొనసాగుతుందని, ఈ విషయాలను ప్రజలు గమనిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో అడ్డగోలుగా హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమమైందన్నారు. అధికారంలో వచ్చి 8 నెలలవుతున్నా 6 గ్యారెంటీలు అమలు కావడం లేదని తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో రైతులకు సమస్యలు సృష్టించి కాంగ్రెస్ నాయకులు లక్షల రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. పోలీస్‌స్టేషన్ల చుట్టూ రైతులు తిరుగలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పేరిట బెదిరించి సంతకాలు చేయించుకున్నారని, చైర్మన్ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలన చేయాలని, ఇంటి దగ్గర కూర్చొని ఎవరికీ బిల్లులు రాకుండా తీర్మానాలు చేయడం అటవిక పాలనకు నిదర్శనమని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో నకిరేకల్ నియోజకవర్గంలో రూ.వందల కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని, వంద పడకల ఆస్పత్రి, రోడ్లు, వైకుంఠధామాలు తదితర అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, కౌన్సిలర్ పల్లె విజయ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు సోమ యాదగిరి, నడికుడి వెంకటేశ్వర్లు, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు సామ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు గుర్రం గణేశ్, రాచకొండ వెంకన్న పాల్గొన్నారు.

నేటి నుంచి కొండపైన స్నాన సంకల్పం, అఖండ దీపారాధన

- **యాదగిరిగుట్ట ఆలయ ఈఓ భాస్కర్‌రావు**

యాదగిరిగుట్ట, ఆగస్టు11: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతీ నక్షత్రం పురస్కరించుకొని ఆదివారం యాదగిరిగుట్ట దేవస్థానంలో స్నాన సంకల్పం, అఖండ దీపారాధనను ప్రారంభించనున్నారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య వీటిని ప్రారంభించనున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. అఖండ దీపారాధనకు ప్రధానాలయ మాఢవీధుల్లోని ఈశాన్య ప్రాంతంలో 32 ఫీట్ల పొడవు, 28 ఫీట్ల వెడల్పుతో ప్రత్యేకమైన రేకులతో కూడిన షెడ్డును నిర్మించినట్లు ఆయన తెలిపారు. భక్తుల కోరిక మేరకు కొండపైన విష్ణుపుష్కరిణిలో స్నాన సంకల్పాన్ని పునః ప్రారంభిచనున్నట్లు ఈవో వెల్లడించారు. ఇందుకోసం పుష్కరిణిలో చెత్తను తొలగించి స్వచ్ఛమైన నీటితో నింపినట్లు చెప్పారు. పై భాగంలో జాలిని ఏర్పాటు చేసి, నీలిరంగు పెయింటింగ్‌తో ముస్తాబు చేసిన్నట్లు తెలిపారు. స్నాన సంకల్పంలో పాల్గొనే భక్తులు రూ.100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. స్నానమాచరించిన అనంతరం దుస్తులు మార్చుకునేందుకు వీలుగా స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా గదులను సిద్ధం చేశామని చెప్పారు. సాధారణ భక్తుల సైతం పుష్కరిణి నీటిని నెత్తిపైన చల్లుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజులకు ఒకసారి పుష్కరిణిలో నీటిని తొలగించి, స్వచ్ఛమైన నీటితో నింపుతామన్నారు. స్నాన సంకల్పం రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందని స్పష్టం చేశారు. ఒకేసారి 100 మందికి అనుమతి ఉంటుందని, వారి స్నాన సంకల్పం పూర్తయిన తర్వాత మరో వందమందిని అనుమతినిస్తామన్నారు. స్వాతీనక్షత్రం సందర్భంగా సామూహిక గిరిప్రదక్షిణను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అనంతరం గిరిప్రదక్షిణ రోడ్డును ఈఓ పరిశీలించారు.

నేడు జిల్లాలో మంత్రుల పర్యటన

- **లిఫ్ట్ ఇరిగేషన్లు, నీటి పారుదల పనులపై సమీక్ష**

నల్లగొండ/నల్లగొండ సిటీ, ఆగస్టు 10 : మిర్యాలగూడ, దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని లిఫ్ట్ ఇరిగేషన్లు, నీటి పారుదల పనులపై సమీక్షకు జిల్లాకు ఆదివారం రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రానున్నారు. పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడంతోపాటు అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు హాజరుకావాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. ఈ విషయమై శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని అడవిదేవులపల్లి మండలం దున్నపోతుల గండి ఎత్తిపోతుల పథకం వద్దకు మంత్రులు చేరుకుంటారని, అక్కడ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మిర్యాలగూడ నియోజకవర్గంలోని అన్ని ఎత్తిపోతల పథకాలు, నీటి పారుదల సమస్యలపై ఇరిగేషన్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు.

సాయంత్రం 4 గంటలకు దున్నపోతుల గండి నుంచి బయల్దేరి 4.20 గంటలకు డిండికి చేరుకుంటారని, అక్కడ దేవరకొండ నియోజకవర్గానికి సంబంధించి సాగు నీటి పనులపై సమీక్ష నిర్వస్తారని చెప్పారు. తెలిపారు. సమీక్ష అనంతరం సాయంత్రం 6 గంటలకు మంత్రులు తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పూర్తి వివరాలతో హాజరుకావాలని అధికారులకు సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు సీఈ నాగేశ్వర్‌రావు, ఎస్ఈ వెంకటేశ్వర్లు, డిండి ప్రాజెక్టు ఇంజినీర్ రాజశేఖర్, ఆర్టీఓలు, తాసీల్దార్లు పాల్గొన్నారు.

సౌండ్ మారితే సీజ్

నీలగిరి, ఆగస్టు 10 : నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లు మార్చి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న 80 బైక్‌లను నల్లగొండ పోలీసులు సీజ్ చేశారు. శనివారం క్లాక్‌టవర్ సెంటర్‌లో ఏఎస్పీ రాములునాయక్ ఆధ్వర్యంలో ఆ సైలెన్సర్లను రోడ్డురోలర్‌తో తొక్కించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ వాహన దారులు కంపెనీ నుంచి వచ్చిన సెలెన్సర్లు మాత్రమే వినియోగించాలని సూచించారు. వాటిని మార్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే శబ్దాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, ట్రాఫిక్ సీఐ క్రాంతి, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, డానియల్ కుమార్, ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

సుంకిశాల ప్రమాద ఘటనపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయాలి

- **మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి**

సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం నాయకులు

పెద్దవూర, ఆగస్టు10 : సుంకిశాల ప్రాజెక్టులో సైడ్ వాల్ కూలిపోయిన ఘటనపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులైన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. పెద్దవూర మండలంలోని పాల్తీ తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ పడిపోయిన ప్రాంతాన్ని శనివారం ఆయన ఆ పార్టీ బృందంతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్న మెగా ఇంజినీరింగ్ కంపెనీ కాల పరిమితిలోగా నిర్మాణం పూర్తి చేసి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదన్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కనీసం పర్యవేక్షించకపోవడం సరైన పద్ధతి కాదని తెలిపారు. ప్రభుత్వం ప్రాజెక్టుపై ఎప్పటికప్పుడు సమీక్షలు జరిపితే ఇలాంటివి తలెత్తేవి కాదని చెప్పారు. ప్రాణనష్టం జరుగలేదని, అధికారులు, ఏజెన్సీ అధికారుల అత్యుత్సాహం ప్రమాదానికి కారణమైందని అన్నారు. పై నుంచి వరదలు వస్తున్న సమయంలో సిమెంట్ పనులు చేయడం వల్ల క్యూరింగ్ కాగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తున్నదని చెప్పారు. పర్వేదుల నుంచి ప్రాజెక్టు వరకు రోడ్డు చాలా అధ్వానంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ కూడా సరిగా చేయలేదని అన్నారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు బండ శ్రీశైలం, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, చిన్నపాక లక్ష్మీనారాయణ, మహమ్మద్ సలీం, పి.నర్సిరెడ్డి, దండంపల్లి సత్తయ్య, షేక్ బషీర్, పూల సత్యనారాయణ, దుబ్బ రామచంద్రం, బాపురెడ్డి పాల్గొన్నారు.

జన సాగరం

26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

డ్యామ్ వద్ద పర్యాటకులు

నందికొండ, ఆగస్టు 10 : నాగార్జునసాగర్ డ్యామ్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో కృష్ణమ్మ అందాలను వీక్షించడానికి పర్యాటకులు పోటెత్తారు. శనివారం విద్యాసంస్థలకు సెలవు కావడంతో లక్షమందికిపైనే తరలివచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఉదయం నుంచి డ్యామ్ వద్ద కొత్త బ్రిడ్జి, జల విద్యుత్ కేంద్రం, శివాలయం పరిసరాలు పర్యాటకులతో కిక్కిరిసిపోయాయి. డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా జాలువారుతున్న కృష్ణమ్మ జల సవ్వడులను పర్యాటకులు వీక్షిస్తూ సెల్ఫీలు, ఫొటోలు దిగారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ నాగార్జునసాగర్ డ్యామ్, బుద్ధవనాన్ని సందర్శించారు.

3,55,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు పైనుంచి భారీగా వరద వస్తున్నది. రిజర్వాయర్ నీటిమట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకుగానూ ప్రస్తుతం 588.00 (306.10 టీఎంసీలు) అడుగులు ఉన్నది. శ్రీశైలం నుంచి 3,55,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నాగార్జునసాగర్‌కు కొనసాగుతుండగా అంతే మొత్తంలో దిగువకు వదిలారు. శనివారం 16 గేట్లు 10 అడుగులు, 10 గేట్లు 5 అడుగుల ఎత్తి 3,12,756 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శుక్రవారం 26 క్రస్ట్ గేట్ల ద్వారా 2,58,608 క్యూసెక్కులు విడుదల చేయగా, శనివారం అదనంగా 54,148 క్యూసెక్కుల నీటిని పెంచి దిగువకు వదిలారు. క్రస్ట్ గేట్లతోపాటు ఎడమ కాల్వ ద్వారా 8,367, కుడి కాల్వ ద్వారా 3,597, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,070, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. పర్యాటకులకు ఇబ్బంది తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం భద్రతతోపాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నది.

కనిపించని మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది సేవలు

డ్యామ్ అందాలను తిలకించడానికి లక్షకు పైగా పర్యాటకులు సాగర్‌కు వస్తున్నారు. కానీ పర్యాటకుల కోసం మున్సిపల్, రెవెన్యూ శాఖలు మంచి నీటి వసతులు, మెడికల్ క్యాంప్‌లు, అంబులెన్స్ వంటి సౌకర్యాలు కల్పించలేదు. మల, మూత్ర విసర్జనకు ఏర్పాట్లు చేయలేదు. దాంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే 5 కిలోమీటర్లు దూరంలో ఉన్న దవాఖానకు తరలించే లోపు ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉన్నది. ఇప్పటికైనా స్థానిక అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని పర్యాటకులు కోరుతున్నారు. లాంచీ స్టేషన్ వద్ద నిరుపయోగంగా ఉన్న మొబైల్ టాయిలెట్‌ను డ్యామ్ పరిసరాల్లో అందుబాటులో ఉంచితే బాగుంటుందని చెబుతున్నారు.

లాంచీ ప్రయాణానికి బ్రేక్

నాగార్జున సాగర్ హిల్‌కాలనీ లాంచీ స్టేషన్ నుంచి లాంచీలను నాగార్జున కొండకు, జాలీ ట్రిప్పులు నడుపడాన్ని శనివారం రద్దు చేశారు. సాగర్‌కు శ్రీశైలం నుంచి వరద భారీ స్థాయిలో వస్తుండడం, సాగర్ ఎర్త్ డ్యామ్ ఆనుకొని ఉన్న లాంచీ స్టేషన్ హైవే రోడ్డుకు సమీపంగా ఉన్నందున ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా నిలిపివేసినట్లు ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత లాంచీలను నడుపుతామని లాంచీ స్టేషన్ జీఎం ఇబ్రహీం తెలిపారు.

15 గేట్ల ద్వారా పులిచింతల నీటి విడుదల

చింతలపాలెం : పై నుంచి వస్తున్న వరదతో పులిచింతల ప్రాజెక్టు 15 గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 175.00(45.77 టీఎంసీలు) అడుగులకుగానూ రాత్రి 8 గంటల వరకు 168.239 (35.910 టీఎంసీలు) అడుగులు ఉన్నది. ఎగువ ప్రాంతాల నుంచి 3,29,932 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 15 గేట్ల నుంచి 3,09,932, జెన్‌కో గేట్ల నుంచి 16,000 క్యూసెక్కులు మొత్తం 3,25,932 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో వెళ్తున్నది. తెలంగాణ జెన్‌కోలో 16000 క్యూసెక్కుల నీటితో 4 యూనిట్ల ద్వారా 80 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నట్లు ఎస్ఈ దేశ్యా నాయక్ తెలిపారు.

నల్లా నీటిలో వానపాములు

- **అపరిశుభ్రంగా ట్యాంకులు.. కలుషితమవుతున్న మంచినీరు**
- **తూతూ మంత్రంగా స్వచ్ఛదనం-పచ్చదనం**

కట్టంగూర్‌లోని శివాలయం వద్ద ట్యాంకులోనుంచి తీసుకొచ్చిన తాగునీటిలో వానపాము

కట్టంగూర్, ఆగస్టు 10 : ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో మినీ ట్యాంకులు నిర్మించారు. కానీ వాటిని శుభ్రం చేయకపోవడంతో మంచినీరు కలుషితమవుతున్నాయి. ట్యాంకులు సరైన మూతలు లేకుండా, చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉంటున్నాయి. విధిలేని పరిస్థితుల్లో ప్రజలు ఆ నీటినే తాగుతూ రోగాల పాలవుతున్నారు. కట్టంగూర్‌లోని శివాలయం వద్ద ఉన్న మినీ ట్యాంకులోని నీటిని శుక్రవారం ఆ ప్రాంత ప్రజలు తీసుకెళ్లగా అందులో వానపాములు కనిపించాయి. కొన్ని నెలల నుంచి ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో తాగునీరు ఇలాగే కలుషితమై వస్తున్నదని ప్రజలు చెబుతున్నారు. మంచినీటిలో వానపాములు వచ్చాయనే సమాచారం సోషల్ మీడియాలో వైరల్ అవడంతో స్పందించిన పంచాయతీ సిబ్బంది వెంటనే ట్యాంకును శుభ్రం చేశారు. వారం రోజులుగా స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు తూతూమంత్రంగా నిర్వహించారే తప్ప ఎక్కడా శుభ్రం చేయలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి నెలా ట్యాంకును బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.